క్లుప్తంగా

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బీవీ రమణయ్య

చిట్టమూరు : రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీవీ రమణయ్య ఆరోపించారు. ఆయన ఆదివారం చిట్టమూరులో పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడుదల రజనీతో సీఐ అనుచితంగా ప్రవర్తించడం దారుణమన్నారు. సీఐపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కంతేరులో ఎస్సీ మహిళా ఎంపీటీసీ అరెస్ట్ సందర్భంగా పోలీసుల తీరు సరికాదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జంగిట సురేష్, వైసీ పుట్టబాబు, ఆశ మధు, అక్కెం మునెయ్య, నెల్లిపూడి మునెయ్య, పామల మణికుమార్, మొగిలి వంశీ, బద్దిగ శ్రీనివాసులు, వినోద్ పాల్గొన్నారు.

దాచూరు విద్యార్థికి గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న పెంచల విజయ్‌రెడ్డి

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం దాచూరు గ్రామానికి చెందిన పెంచలస్వామి కుమారుడు పెంచల విజయ్‌రెడ్డి ఇంఫాల్‌లోని సెంట్రల్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ పొందాడు. అతను అగ్రికల్చర్ ఎంఎస్సీలో అత్యధిక మార్కులు సాధించాడు. అతన్ని గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

రెండు రోజులుగా ఓపెన్‌లోనే స్త్రీశక్తి భవనం



స్త్రీశక్తి కార్యాలయంలో వున్న కుక్క

వాకాడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న స్త్రీశక్తి (వెలుగు) కార్యాలయ అధికారుల నిర్లక్ష్యం అంతాఇంతా కాదు. కార్యాలయానికి రెండు రోజులుగా తలుపులు వేయకుండా వదిలి వెళ్లారు. స్థానికుల కథనం మేరకు అధికారులు, సిబ్బంది శుక్రవారం సాయంత్రం వరకు కార్యాలయంలో విధులు నిర్వహించారు. ఇళ్లకు వెళ్లేటప్పుడు తాళాలు వేయకుండా వదిలేశారు. శని, ఆదివారాలు సెలవులు కావడంతో అటువైపు ఎవరూ రాలేదు. కార్యాలయంలో విలువైన కంప్యూటర్లు, రికార్డులు, ఫర్నీచర్ తదితర వస్తువులు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు గుంపులుగా చేరి గందరగోళం చేయడంతో స్థానికులు గమనించి మీడియాకు సమాచారం అందించారు.

క్రికెట్ వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం



శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాజశేఖరరెడ్డి

చిల్లకూరు : వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఇస్తున్న శిక్షణలో బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్, క్యాచ్‌లు ఎలా పట్టాలనే విషయాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా శిక్షకుడిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని పిల్లలు క్రమం తప్పకుండా శిక్షణకు రావాలని కోరారు. అనంతరం సుమారు 100 మంది పిల్లలు పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కే శ్రీనివాసులురెడ్డి, రోటరీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ జనార్ధనరెడ్డి, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన సబ్ సెంటర్ ఇన్‌చార్జి కొణిదెల మునిగిరీష్, కౌన్సిలర్ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 44.425 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 44.425 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 850, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటినివిడుదల చేస్తున్నట్లు తెలిపారు.

సింహ వాహనంపై నృసింహుడి వైభవం

- రాత్రి గరుడ వాహనంపై ఊరేగిన భక్తవరదుడు
- భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన
- బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసులు



సింహ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

రాపూరు: పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి యోగ నరసింహుడిగా ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అంతకుముందు నృసింహ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6 గంటలకు స్వామి, అమ్మవార్లతోపాటు ఆంజనేయుడికి పూలంగి సేవ చేపట్టారు. తదుపరి స్వామిని విశేషంగా అలంకరించి సింహ వాహనంపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం చేశారు. ఉదయం 11.30 గంటలకు క్రేన్ మండపంలో శ్రీవారితోపాటు ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి నవ కలశ స్నపన తిరుమంజనం చేపట్టారు. భక్తులకు పలువురు పలుచోట్ల అన్నదానం చేశారు. వివిధ కులాలకు చెందిన సత్రాల్లో అన్నదానం చేపట్టారు.

శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ

పెంచలకోనలోని రాత్రి 7 గంటలకు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిని విశేషంగా అలంకరించి తిరుచ్చిలో కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో సహస్ర దీపాలంకరణ మండపంలోకి వేంచేపు చేశారు. అక్కడ 1008 దీపాలు వెలిగించి ఊంజల్ సేవ చేశారు. కార్యక్రమంలో ఏసీ శ్రీనావాసులు రెడ్డి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు చెన్ను తిరుపాల్‌రెడ్డి, సోమయ్య, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతా రామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమ పండితులు రామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గరుడుడిపై నృసింహుని దివ్యదర్శనం

పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ వాహన సేవను ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. శంఖు, చక్ర, వరద, అభయ హస్తాలు, వజ్రాభరణాలతో విశేషాలంకృతుడైన స్వామి వారు తనకు అత్యంత ప్రీతిపాత్రుడైన గరుడుడిపై కొలువుదీరి కోన తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. తిరుపతి, నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. గరుడ వాహన సేవలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

నేడు శ్రీవారి తిరుకల్యాణం

పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకు శ్రీవారికి పూలంగి సేవ, కల్యాణం, రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటలకు గజవాహన సేవ, 12 గంటలకు ఏకాంతసేవ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

యాగశాలలో చతుష్టానార్చన హోమం



పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న యాగశాలలో ఉదయం చతుష్టానార్చన హోమాన్ని టీటీడీ ఆగమ పండితులు రామానుజచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అలాగే అగ్నిప్రతిష్ట, విశేష హోమాలు చేశారు. స్వామి తేజస్సు పెంచడంతోపాటు భక్తుల క్షేమ, ఆయురారోగ్యాల కోసం హోమం నిర్వహించినట్లు పండితులు చెప్పారు.



పెంచలకోనలోని కోనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు



కోనేరులో స్నానమాచరించి వరపడిన మహిళలు



సంతానం కోసం వటవృక్షం వద్ద ఊయలలు కడుతున్న మహిళలు



స్నపన తిరుమంజనం అనంతరం స్వామి వారిని అలంకరిస్తున్న అర్చకులు

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

కలువాయి(సైదాపురం): రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి హెచ్చరించారు. కలువాయిలో జరుగుతున్న రేషన్ మాఫియా దందాపై ఎవడ్రా మన వాహనాలను ఆపేది అన్న శీర్షికన ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. కలువాయిలో జరుగుతున్న ఘటనలపై విచారించి నివేదిక ఇవ్వాలని డీఎస్‌వో విజయ్‌కుమార్‌ను ఆదేశించారు.

లేబర్ కోడ్లను రద్దు కోరుతూ 20న సమ్మె



మాట్లాడుతున్న వడ్డిపల్లి చెంగయ్య

వెంకటగిరి రూరల్: లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న జాతీయ స్థాయిలో సమ్మె చేపడుతున్నట్టు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య తెలిపారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వున్న మున్సిపల్ కార్మికులకు అవగాహన కల్పించి సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెంచలయ్య, సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రమణ్యం, గోపాల్, కృష్ణమ్మ, మాధురి, ఇందిరమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగార్పమ్మ జాతర



పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండలం పుదూరులో గ్రామదేవత నాగార్పమ్మ జాతర ఉత్సవాలను ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మూడు రోజులుగా అమ్మణ్ణి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టారు. రాత్రి అమ్మణ్ణితో పాటు గంగపెట్టెను తీసుకుని వీరతాళ్లతో కొట్టుకుంటూ గ్రామోత్సవం జరిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కామిరెడ్డి రాజారెడ్డి, మండల కన్వీనర్ ఓట్టురు కిషోర్ యాదవ్, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మీ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా గంగమ్మ గ్రామోత్సవం

కోట: మండలంలోని వెంకన్నపాళెంలో గంగమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సామూహిక గ్రామ పొంగళ్లు పెట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని వల్లీ దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. నృసింహ జయంతి సందర్భంగా లక్ష్మీ నరసింహ స్వామి, వ్యూహలక్ష్మి అమ్మవారికి అభిషేకాలు, హోమాలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ, పీఠం సభ్యులు, ఉభయదాతలు పాల్గొన్నారు.

శేషుడిపై ఊరేగిన కరిమాణిక్యస్వామి



ధ్వజారోహణ పూజలు చేస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్ : తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, సహస్రనామార్చన చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం చేపట్టారు. కొడి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. తదుపరి ఏకాంత సేవ చేశారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరి రెడ్డి, సుధీర్, ఆలయ ప్రధాన అర్చకులు శేషాద్రిస్వామి, టీటీడీ వేద పండితులు బాలాజీస్వామి, బాబు స్వామి మోహన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమంత వాహనం

తుమ్మూరు కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి హనుమంత వాహన సేవ నిర్వహించనున్నట్టు ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి తెలిపారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం చేస్తున్న వేదపండితులు



బాలాయపల్లిలో గ్రామోత్సవం

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని రాజుపాళెంలో వెలసిన శ్రీరాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. రాజుపాళెం గ్రామానికి చెందిన ప్రణీత్‌వర్మ, శాలి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

బాలాయపల్లిలో..

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం నిండలి గ్రామంలో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించా రు. అనంతరం సీతారాముల గ్రామోత్సవం చేపట్టారు. అదేవిధంగా అలిమిలి సమీపంలోని కనుమరాయికొండపై వెలసిన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంపై కొలువుదీర్చి ఊరేగించారు.

వేడుకగా సుబ్రమణ్యేశ్వర స్వామి శాంతి కల్యాణం

చిట్టమూరు : మండలంలోని మల్లాంలో వెలసిన స్వయంభువు వల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు శాంతి కల్యాణం చేశారు. అలాగే కుజదోషం ఉన్న వారు ఆలయంలో హోమాలు వేశారు. శాంతి కల్యాణం కార్యక్రమానికి శ్రీకాళహస్తికి చెందిన వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా బెంగళూరుకు చెందిన చిల్లకూరు ఉదయ్‌కుమార్ రెడ్డి, సుహిత వ్యవహరించారు.

తాగునీటితో ఆకుకూరల పెంపకం



పెళ్లకూరు: మండలంలోని అనకవోలు గ్రామంలో మంచినీటి పథకం పైపులైన్ నుంచి కొందరు అక్రమంగా కనెక్షన్ తీసుకుని ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. దీంతో ఎగువ ప్రాంతంలోని వారి కొళాయిల్లో నీరు సక్రమంగా రావడం లేదు. ఈ గ్రామంలో సుమారు 270 కుటుంబాలు ఉన్నాయి. మంచినీటి పథకం ఉన్నా తాగునీటి కోసం వ్యవసాయ బావులు, బోర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులు, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానిక సర్పంచ్ చెంచురామయ్య వాపోయాడు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిల్లకూరు : మండల కేంద్రమైన చిల్లకూరులోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం బిగ్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మీడియా సంస్థలు సమాచారాన్ని ప్రజలకు చేరవేడమే కాకుండా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ అవసరమైన వారికి తిరుపతి, నెల్లూరులో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణం కాంపాళెం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం కవచ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు గుండు మనోజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతికి చెందిన వాసవి ఐకేర్, నారాయణాద్రి వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. సుమారు 132 మంది రోగులు వైద్యపరీక్ష చేయించుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



శ్రీకంఠి రామోహన్‌రావును సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చిల్లకూరు : ఆడిటర్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని సీనియర్ రోటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. రామ్మోహన్‌రావు ఆదివారం గూడూరు పట్టణంలోని తన కార్యాలయంలో పుట్టిన రోజు జరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సత్కరించారు. ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గూడూరు పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఎంతో మంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్నారని తెలిపారు. అనంతరం వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ వెస్ట్ క్లబ్ కార్యదర్శి చోళవరం గిరిబాబు, ఏసీ వాసుగౌడ్, బండి ధనుంజయరెడ్డి, దువ్వూరు విజయభాస్కరరెడ్డి, కందాటి రాఘవరెడ్డి, నాగరాజురెడ్డి, వాసు, శేగు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్ : మండలంలోని చిగురుపాడులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. చిగురుపాడుకు చెందిన మేర్లపాక రమేష్(40) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ కలహాలతో జీవితం విరక్తి చెంది ఈ నెల 9న ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో వున్న అతన్ని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గరుడ వాహనా గోవిందా..





ఉగ్ర నరసింహుని నృత్యరూపకం, గరుడ వాహనంపై దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహుడు

చిల్లకూరు: కలువకొండలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు ఆదివారం గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం మోమిడికి చెందిన మేగనూరు వెంకటక్రిష్ణయ్య దంపతులు పుష్పాలంకరణ చేపట్టారు. చెన్నైకి చెందిన పొన్నలూరు రామచంద్రారెడ్డి, కవిత సహకారంతో తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. తమ్మినపట్నం కోదండరామస్వామి ఆలయ మాజీ చైర్మన్లు యరటపల్లి చరణ్‌కుమార్ రెడ్డి, సాయిపృథ్వీరెడ్డి ఉభయకర్తలుగా సాయంత్రం గరుడ సేవను చేపట్టారు. ఈ సందర్భంగా గూడూరుకు చెందిన భరతనాట్య మండలి కళాకారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రెచ్చిపోతున్న భూ బకాసురులు



అమ్మవారి విగ్రహం ప్రతిష్టించిన భూమిని చదును చేసిన అక్రమార్కులు



ఆలయ నిర్వాహకులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలో భూబకాసురులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. బంగారుపేట బీసీ కాలనీలో శ్రీ విష్ణుదుర్గ పరమేశ్వరి పీఠం వద్దనున్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. బీసీ కాలనీలో ఎనిమిదేళ్ల క్రితం శ్రీ విష్ణుదుర్గ పరమేశ్వరి పీఠాన్ని ఏర్పాటుచేసుకుని పూజలు చేస్తున్నారు. భక్తులు కూడా పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో పీఠం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో స్థానికుల సహకారంతో ఏడేళ్ల క్రితం అన్నపూర్ణాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆ భూమిపై కన్నేసిన భూ బకాసురులు మూడు రోజుల క్రితం జేసీబీతో చదును చేశారు. అన్నపూర్ణాదేవి విగ్రహాన్ని తొలగించి ముళ్లపొదల్లో పడేశారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీఆర్వో నాగేంద్ర అక్కడికి చేరుకుని పరిశీలించారు. పోలీసులకు ఫిర్యాదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాంబాబు తెలిపారు.

దేవతలకు కూడా రక్షణ లేదు

వెంకటగిరి (సైదాపురం) : కూటమి ప్రభుత్వంలో అరాచకాలు పెరిగిపోతున్నాయని, దేవతలకు కూడా రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ వెంకటగిరి మున్సిపాలిటీ 2వ వార్డులో అన్నపూర్ణాదేవి విగ్రహాన్ని తొలగించి భూ ఆక్రమణకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయంపై తిరుపతి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు.